# పాడుదమా !



పాడుదమా స్వేచ్ఛా గీతం
ఎగరేయుదమా జాతిపతాకం
దిగంతాల నినదించి - విశ్వ
విఖ్యాతి నొందగా జాతిగౌరవం ॥ పాడు ॥

జలియన్ వాలాబాగ్ దురంతపు
నెత్తిటి ధారల గొత్తుకుని
ఉరికొయ్యల చెరసాలల గోడల
దారుణాలు తలకెత్తుకుని
పొగిలిన కాలం - పోరాడిన కాలం
మరిమరి ఒక పరితలచుకుని
మృతవీరుల నెదనిడి కొలుచుకునీ... ॥ పాడు ॥

వందెమాతరమని నినదించిన
వీరుల శౌర్యము నలదికొని
స్వాతంత్ర్యం నా జన్మహక్కని
గర్జించిన గళమందుకుని
పోరాటబలం - స్వాతంత్ర్యఫలం
కలకాలం కాపాడుకుని
కడుగర్వంగా కొనియాడుకుని.... ॥ పాడు ॥

మన్యం గుండెల మంటై రగిలిన
విప్లవజ్యోతి స్ఫూర్తియని
గుండెకెదురుగా గుండెను నిలిపిన
తెలుగు సింగముల తెగువగని
చీకటి గుండెల - బాకై మెరిసిన
గరిమెళ్ళను గరు తంచుకుని
మన తెలుగు తేజమును నింపుకునీ ॥ పాడు ॥

జనగణమనముల జాగృతి నింపి
జండా గాధలు చెప్పుకుని
జయహే జయజయహై జననీయని
జయగీతమ్ములు పాడుకుని
పావన చరితం - పరిమళ భరితం
అఖండ భారత ఖండమని
అది అక్షయ అమృత బాంధమనీ ... ॥ పాడు ॥

# ఆ చల్లని సముద్ర గర్భం

ఆ చల్లని సముద్ర గర్భం
దాచిన బడబానల మెంతో
ఆ నల్లని ఆకాశంలో
కానరాని భాస్కరులెందరో ॥ ఆ చల్లని ॥

భూగోళం పుట్టుక కోసం
రాలిన సురగోళాలెన్నో
ఈ మానవ రూపం కోసం
జరిగిన పరిణామాలెన్నో...
ఒక రాజును గెలిపించుటలో
ఒరిగిన నరకంఠాలెన్నో
కులమతాల సుడిగుండాలకు
బలికాని పవిత్రులెందరో ॥ ఆ చల్లని ॥

మానవకళ్యాణం కోసం
ఫణమొడ్డిన రక్తం ఎంతో
రణరక్కసి కరాళ నృత్యం
రాల్చిన పసి ప్రాణాలెన్నో
కడుపుకోతతో అల్లాడిన
కన్నులలో విషాదమెంతో
ధనవంతుల దుర్మార్గాలకు
దగ్ధమైన బ్రతుకులు ఎన్నో ॥ ఆ చల్లని ॥

అన్నార్తులు అనాధలుండని - ఆ నవయుగం మదెంత దూరం
కరువంటూ కాటకమంటు - కనుపించని కాలాలెపుడో
పసిపాపల నిదురకనులలో - ముసిరిన భవితవ్యం ఎంతో
గాయపడిన కవి గుండెలలో - వ్రాయబడని కావ్యాలెన్నో ॥ ఆ చల్లని

# జీవితాన గెలుపుందని



జీవితాన గెలుపుందని నమ్మకాన్ని పెంచుదాం
స్వర్గమనేదే ఉంటే నేలపైకి దించుదాం
జీవితాన గెలుపుందని నమ్మకాన్ని పెంచుదాం
స్వర్గమనేదే ఉంటే నేలపైకి దించుదాం

గగనమెంత ఉరిమినా
గిరికి చలన ముండునా?
గంగపొంగి పొరలినా
నేలభీతి చెందునా?
ఆత్మబలం కూడగట్టి ఆకాశాన్ని వంచుదాం
స్వర్గమనేదే ఉంటే నేలపైకి దించుదాం ॥ జీవితాన ॥

ఆకులన్ని రాలినా
వేసవి వెంటాడినా
చినుకురాలకుండునా
చిగురువేయకుండునా
ఆశయాల నీరుపోసి ఆశలన్ని పెంచుదాం
స్వర్గమనేదే ఉంటే నేలపైకి దించుదాం ॥ జీవితాన ॥

పేదరికం కసరినా
పునుచీకటి ముసిరినా
వేల జనం మేలుకుంటే
వేకువరాకుండునా
అందుకున్న విజయాలను అందరికీ పంచుదాం
స్వర్గమనేదే ఉంటే నేలపైకి దించుదాం ॥ జీవితాన ॥

# ఓ లాలో ఓలాలా



ఓ లాలో  ఓలాలా
ఓలాలమో........లాలమ్మ

నిద్దురలేచీ లేవంగానే వాకిలి పిలిచెను ఓలాలా
వాకిలి ఊడ్చీ ముగ్గేస్తుంటే రోకలి పిలచెను ఓలాలా ॥ ఓలాలో ॥

కుంచెడు వడ్డు దంచుత ఉంటె కుండలు పిలిచెను ఓలాలా
కుండలు తోమీ బోర్లిస్తుంటే కుంపటి పిలిచెను ఓలాలా ॥ ఓ లాలో ॥

కూడూ, కూరా వండుతు ఉంటె కుళాయి పిలిచెను ఓలాలా
కుళాయి నీళ్ళూ మోస్తా ఉంటే కూలికి పిలిచిరి ఓలాలా ॥ ఓలాలో ॥

నడిమి ఎండలో నాట్లేస్తుంటే నడుము పట్టినది ఓలాలా
సాయంత్రానికి ఇంటికి వస్తే చాకిరి తప్పదు ఓలాలా ॥ ఓలాలో ॥

అరవై ఏళ్ళూ మరలా నేనూ గిరగిర తిరిగితి ఓలాలా
ముసలివయసులో ముద్దలేకనే వీధిన బడితిని ఓలాలా ॥ ఓలాలో॥

ముందుచూపు ఇక లేకుంటే మరి ముప్పు తప్పదే ఓలాలా
సంఘం నీడలో, సంఘం తోడుగ చల్లగ ఉండరె ఓలాలా ॥ఓలాలో ॥

